

అభివాదం చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘాల నేతలు

గ్రేటర్‌లో కల్లు కాంపౌండ్ల మూసివేతకు కుట్ర

● తెలంగాణ గౌడ సంఘాల నేతలు

పంజాగుట్ట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో కల్లు గీత వృత్తి, కాంపౌండ్లను మూసివేతకు కుట్ర జరుగుతోందని తెలంగాణ గౌడ సంఘాల నేతలు ఆరోపించారు. గ్రామానికో మద్యం దుకాణాన్ని తెరవాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ గౌడ ఐక్య సాధన సమితి, కల్లు దుకాణాల సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ సమావేశంలో మాట్లాడుతూ జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని, ఈ నెల 18న ఆయన జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్‌పై పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో అనధికారికంగా మూసేసిన కల్లు దుకాణాలను 10 రోజుల్లో తెరిపించాలని, లేదంటే ఉమ్మడి జిల్లాల్లో యాత్ర చేస్తామని అన్నారు. ఇందిరా పార్కు వద్ద వేల మందితో మహా ధర్నా, లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించింది.

వాటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు పరిష్కారం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలు పరిష్కారమయ్యాయి. ఆన్‌లైన్ సేవలన్నీ శుక్రవారం రాత్రి నుంచే అందుబాటులోకి వచ్చాయి. స్టేట్ డాటా సెంటర్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో వాటర్‌బోర్డులో ఆన్‌లైన్ సేవలు గురువారం సాయంత్రం నుంచి స్తంభించిన విషయం విదితమే. ప్రస్తుతం ఆన్‌లైన్ సేవలన్నీ పునరుద్ధరించడంతో నీటి ట్యాంకర్ల బుకింగ్, డెలివరీ, నీటిబిల్లుల చెల్లింపులు, నల్లా కనెక్షన్ల దరఖాస్తులు యథాతథంగా కొనసాగుతున్నాయి.

ఫాంహౌస్‌కు పరిమితమైన కేసీఆర్: సాయికుమార్

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేతగా బాధ్యతలను విస్మరించిన కేసీఆర్ ఫాంహౌస్‌కు పరిమితమయ్యారని రాష్ట్రఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆరోపించారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ప్రతినెలా రూ. 2.75 లక్షలచొప్పున గడిచిన 18 నెలల కాలంలో రూ.49.5 లక్షలు తీసుకున్నారని పేర్కొన్నారు. శనివారం గాంధీభవన్‌లో సాయికుమార్ విలేకరులతో మాట్లాడారు. 18 నెలల కాలంలో కేసీఆర్ ఒకే ఒక్క రోజు అసెంబ్లీ ముఖం చూశారని అన్నారు. కనీసం వచ్చే అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకైనా కేసీఆర్ హాజరై ప్రతిపక్ష నాయకునిగా పాత్ర పోషిస్తారని ఆశిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

నీట్ పరీక్ష కేంద్రాల వద్ద ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఎంబీఈఎంఎస్, నీట్ పీజీ పరీక్షలు జరుగనున్న సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద ఆంక్షలు అమలులో ఉంటాయని రాచకొండ కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 200 మీటర్ల పరిధిలో ఐదుకంటే ఎక్కువ మంది గుమిగూడటం, సమావేశాలు నిర్వహించడం చేయకూడదని తెలిపారు.

యూపీఎస్సీ పరీక్షలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో ఆదివారం జరిగే యూపీఎస్సీ పరీక్షలకు గ్రేటర్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుందని గ్రేటర్ ఆర్టీసీ ఈడీ రాజశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరిగే పరీక్షలు రాసే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా సర్వీసులు నడుపుతామని తెలిపారు. బస్టాండ్లు, ముఖ్య పాయింట్లలో ఆర్టీసీ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. బస్సుల సమాచారం కోసం కోఠి - 9959226160, రేతిఫైల్ బస్‌స్టేషన్ - 9959226154లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆపరేషన్ ముస్కాన్‌లో 3,853 మంది పిల్లలను రక్షించిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా సైబరాబాద్, రాచకొండ కమిషరేట్‌ల పరిధిలో 3,853 మంది పిల్లలను పోలీసులు రక్షించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1,374 మంది చిన్నారులను కాపాడారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 11 టీములుగా ఏర్పడిన అధికారులు 1,328 మంది బాలురు, 46 మంది బాలికలను కాపాడారు. రాచకొండ కమిషరేట్ పరిధిలో పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు 2,479 మంది చిన్నారులను వెట్టి నుంచి కాపాడారు. బాలలను పనుల్లో పెట్టుకున్న 530 మందిపై కేసులు నమోదు చేశారు. కాపాడిన చిన్నారుల్లో 2,353 మంది బాలురు, 126 మంది బాలికలు ఉన్నారు. చిన్నారులను వెట్టి చాకిరీ నుంచి కాపాడిన అధికారులను రాచకొండ సీపీ సుధీర్‌బాబు అభినందించారు.

అనారోగ్య పరిస్థితుల్లో విద్యార్థుల హాజరుపై కఠినంగా ఉండొద్దు

● గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అనారోగ్య కారణాలను, అందుకు సంబంధించిన ఆధారాలను పరిగణనలోకి తీసుకుని హాజరుశాతంపై నిర్ణయం తీసుకోవాలని ఇంజనీరింగ్ కాలేజీని హైకోర్టు ఆదేశించింది. తీవ్ర అనారోగ్యం వల్ల విద్యార్థుల హాజరు శాతం తగ్గితే కఠినంగా వ్యవహరించరాదని పేర్కొంది. తాను ఇంజినీరింగ్ మూడో సంవత్సరం (2024-25) సెకండ్ సెమిస్టర్ పరీక్షలు రాయకుండా కాలేజీ సర్క్యులర్ జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసరలోని గీతాంజలి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్)కి చెందిన బీటెక్ (సీఎస్ఈ) విద్యార్థిని కొండపర్తి మాన్విత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.శరత్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది టి.శ్రీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పరీక్ష రుసుము వసూలు చేసిన కాలేజీ, ఆమె అనారోగ్య కారణాలను, వైద్య సర్టిఫికెట్లను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకోకుండా 65 శాతం హాజరు లేదని 49 శాతమే ఉందంటూ పరీక్షలకు అనుమతించడం లేదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఆమెకు వ్యతిరేకంగా కాలేజీ జారీ చేసిన సర్క్యులర్‌ను కొట్టివేసింది. పరీక్షలు రాసేందుకు అనుమతించాలని కాలేజీకి, ఉన్నత విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది.



వెంకట సుబ్బారావుకు పురస్కారం ప్రదానం చేస్తున్న దత్తాత్రేయ, తదితరులు

నిస్వార్థ ప్రజాసేవకు ప్రతీక పింగళి వెంకయ్య

చిక్కడపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య నిస్వార్థ ప్రజాసేవకు ప్రతీక అని హరియాణా రాష్ట్ర పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. వంశీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయగానసభలో నిర్వహించిన కార్యక్రమంలో పింగళి వెంకయ్య 148వ జయంతి సందర్భంగా గోవిందరాజు వెంకట సుబ్బారావుకు పింగళి వెంకయ్య వంశీ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ మాట్లాడారు. భూదాన ఉద్యమంలో మద్యపాన నిషేధం అమలు కోసం ఉద్యమించిన వెంకట సుబ్బారావు పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. కార్యక్రమానికి రాష్ట్రప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కేవీ రమణాచారి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పింగళి వెంకయ్య మనువడు నరసింహం, వంశీ రామరాజు, సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, సాహితీవేత్త డా.సుధాదేవి పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపులో అవకతవకలు

● ఫీజుల పెంపులో ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్‌పై లేదు
● రాష్ట్రవ్యాప్త ఆందోళనలు తప్పవు
● బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ



విద్యానగర్‌లో ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపులో అవకతవకలతో కూడిన పత్రం విడుదల చేస్తున్న వేముల రామకృష్ణ తదితరులు

నల్లకుంట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన బీటెక్ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుండగా సీట్ల కేటాయింపులో పారదర్శకత, కన్వీనర్ కోటా సీట్ల భర్తీ విషయంలో తీవ్రమైన ఆందోళన నెలకొంటుందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణ ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపులో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. శనివారం విద్యానగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొన్న ప్రకటించిన ఇంజనీరింగ్ కాలేజ్ కన్వీనర్ కోటా సీట్ల కేటాయింపులో అమ్మాయిల రిజర్వుడ్ సీట్లలో అబ్బాయిలకు సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఓపెన్ కోటా కేటగిరిలో అమ్మాయిలకు రావాల్సిన సీట్లను అబ్బాయిలకు ఎలా కేటాయించారో టీజీఈఏపీసీఈటీ కన్వీనర్ వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులకు కాలేజీ ఫీజులు పెంచడంపై ఉన్న శ్రద్ధ పిల్లల భవిష్యత్‌పై లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపులో చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, ప్రవీణ్, రాహుల్, అర్జున్, వినయ్, సురేందర్, ప్రభు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే వెంకటేష్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, పక్కన కార్పొరేటర్ పద్మ

నాలా సమస్య పరిష్కరించండి

అంబర్‌పేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌లో ప్రజలెదుర్కొంటున్న నాలా సమస్యను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ మంత్రి పొన్నం ప్రభాకర్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. శనివారం అంబర్‌పేటకు వచ్చిన మంత్రిని ఆయన కలిసి మాట్లాడారు. మోహిన్ చెరువు నుంచి మూసారాంబాగ్ ఎస్టీపీ వరకు విస్తరించి ఉన్న నాలా వల్ల స్థానికులకు వర్షా కాలంలో వచ్చే వరదనీటితో ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. నాలా సీపీఎల్ ప్రహరీని ఆనుకుని ఉన్న 832 మీటర్ల పొడవైన నాలా డీజీపీ వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. దానికి వెంటనే క్లియరెన్స్ ఇప్పించి నాలా సమస్య పరిష్కారమయ్యేట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. పటేల్‌నగర్ చౌరస్తా నుంచి ఎస్టీపీ వరకు విస్తరించిన నాలా పూర్తిగా దెబ్బతిన్నదని మంత్రి చొరవ తీసుకుని నూతన నాలా పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాగ్అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మ, బీఆర్ఎస్ నాయకులు మహేష్ ముదిరాజ్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో వివా కామ్రేడ్ రవి మంజీర అడుగుజాడల అన్వేషణ పుస్తకాన్ని ఆవిష్కరించిన పలువురు ప్రముఖులు

వివా కామ్రేడ్ రవి మంజీర అడుగుజాడల అన్వేషణ పుస్తకావిష్కరణ

రాంనగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విప్లవ రచయితల సంఘం ఆధ్వర్యంలో వివా కామ్రేడ్ రవి మంజీర అడుగు జాడల అన్వేషణ పుస్తకావిష్కరణ శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగింది. విరసం కార్యవర్గ సభ్యులు శివవర్రి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలుగా సాహితీ విమర్శకులు ఏకే.ప్రభాకర్, వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్, పాణి, అమరుల బంధు మిత్రుల సంఘం కార్యదర్శి పద్మకుమారి, రచయిత్రి స్నేహ, మంజీర సహచరి తాయమ్మ కరుణ పాల్గొన్నారు. మంజీర కవిత్వాన్ని ఉదయ కిరణ్, శశిధర్, విప్లవశ్రీ, శ్రీధర్ కట్టా చదివి వినిపించారు. మంజీర విద్యార్థి ఉద్యమం నుంచి అంచలంచెలుగా ఎదిగి విప్లవోద్యమానికి నాయకత్వాన్ని వహించారన్నారు. మేధావిగా, ఆలోచనాపరుడిగా, కవిగా, కథకుడిగా ఆయన చేసిన రచనల గురించి వక్తలు, సహచరులు పంచుకున్నారు. విప్లవోద్యమ త్యాగ సంప్రదాయాలకు వారసుడిగా మంజీర (మఠం రవికుమార్) ప్రస్థానాన్ని వక్తలు గుర్తు చేసుకున్నారు. వివా కామ్రేడ్ రవి పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాల్సిన అవసరం ఉందన్నారు.

● కొత్త రేషన్‌కార్డు ఆనందం



ముషీరాబాద్‌లో శనివారం మంజూరైన కొత్త రేషన్‌కార్డులు పొందిన లబ్ధిదారులను బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ కలిసి వారితో ఆనందం పంచుకున్నారు. లబ్ధిదారులు తమకు చాలాకాలం తరువాత రేషన్‌కార్డులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భోలక్‌పూర్, కవాడిగూడ, గాంధీనగర్, బీఆర్ఎస్ అధ్యక్షులు వై. శ్రీనివాస్‌రావు, వల్లాల శ్యామ్‌యాదవ్, రాకేష్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, శంకర్‌గౌడ్, గోవింద్‌రాజ్, ప్రవీణ్, సత్యనారాయణబాబు తదితరులు పాల్గొన్నారు. - (ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి)

నేడు తెలంగాణ మాలల జేఏసీ సమావేశం

చిక్కడపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాలల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11 గంటలకు గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో మాలల సమావేశం నిర్వహిస్తున్నట్లు జేఏసీ చైర్మన్ దయానంద్, కోచైర్మన్ నర్మెట్ట మల్లేష్ తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం రోస్టర్ ప్రకటించిందన్నారు. దీనివల్ల మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఈ సమావేశాన్ని మాల సోదరులు జయప్రదం చేయాలని కోరారు.

పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలి



పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కేహెచ్ఎస్.జగదాంబ, చైర్మన్ శ్యామల్‌రావు తదితరులు

రాంనగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలని పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కేహెచ్ఎస్.జగదాంబ, చైర్మన్ శ్యామల్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం రాంనగర్ గుండులోని ట్రస్ట్ కార్యాలయంలో పింగళి వెంకయ్య జయంతి వేడుకలు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, మాట్లాడారు. పింగళి వెంకయ్య చరిత్రను భావితరాలకు తెలిసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధానకార్యదర్శి బంగారు ప్రశాంత్, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణ యాదవ్, నగర కార్యవర్గ సభ్యులు కౌండిన్యప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు కె.మాధవ్, ఓంప్రకాష్, లక్ష్మణ్, శ్యామ్, శైలజఠాకూర్ పాల్గొన్నారు.

జర్నలిస్టులపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు : పృథ్వీరాజ్

రాంనగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ ధ్వజమెత్తారు. సీఎం స్థాయిలో ఉండి అమర్యాదగా అసభ్యకరంగా మాట్లాడడం మంచిది కాదన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డిజిటల్ మీడియా జర్నలిస్టులపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం మాటలు అభ్యంతకరంగా ఉన్నాయని, తన గౌరవాన్ని ప్రశ్నించుకునే విధంగా మాట్లాడారని విమర్శించారు. అక్షరం ముక్కరాని వారు జర్నలిస్టులుగా కొనసాగుతున్నారని ఏమి చదువుకున్నారని, అయితే సీఎం ఎంత వరకు చదువుకున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కంటే రేవంత్‌రెడ్డి ఎక్కువ చదివారా అని ఆయన ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి కేటీఆర్‌కు తేడా లేకుండా పోయిందని, ఎన్నికల ముందు కాంగ్రెస్‌కు అడ్రస్ కూడా లేదని యూట్యూబ్ చానెల్స్ కేసీఆర్ అవినీతిని ఎండగట్టడం వల్లనే 'మీరు' అధికారంలోకి వచ్చిన విషయం గుర్తుకు తెచ్చుకోవాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో వైలర్‌టీవీ ప్రతినిధి రంజిత్, కాళోజీ టీవీ ప్రతినిధి దాసరి శ్రీనివాస్, పక్క తెలంగాణ టీవీ రాము, పీఎంఆర్‌టీవీ, మహిపాల్ యాదవ్, మన తొలివెలుగు ప్రతినిధి రఘు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

నాలా పక్కన ఇంట్లోకి కొండ చిలువ

రాంనగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ నాలా పక్కన గల గణేష్‌నగర్‌లోని ఓ ఇంటి ఆవరణలోకి కొండ చిలువ వచ్చింది. దీంతో ఆ ఇంటి యజమాని, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గణేష్‌నగర్ బ్రిడ్జి సమీపంలోని నాలా పక్కన బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి నాలాలో నుంచి అతని ఇంటి ఆవరణలోకి కొండ చిలువ చేరింది. గమనించిన నేత శ్రీనివాస్ భయాందోళనకు గురై వెంటనే ఇంటి సభ్యులను బయటకు రావద్దని చెప్పి, పాము లోపలికి రాకుండా జాగ్రత్తలు చూశారు. స్థానికుల సహకారంతో ఈ విషయాన్ని వెంటనే అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు వెంటనే స్నేక్ స్నాచర్‌ను పంపించి పామును బంధించారు. దీంతో అతని కుటుంబ సభ్యులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన గణేష్‌నగర్‌తో పాటు పరిసర ప్రాంతాలలో కలకలం నెలకొంది. అక్కడికి వచ్చిన ప్రజలు చేరుకుని ఆ పామును సెల్‌ఫోన్‌లో వీడియోలు తీసుకున్నారు. ఇళ్లలోకి పాములు రాకుండా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితుడు నేత శ్రీనివాస్ కోరారు.



గణేష్‌నగర్‌లో ఓ ఇంట్లోకి వచ్చిన కొండ చిలువను పట్టుకున్న స్నేక్ స్నాచర్

జాబ్‌క్యాలెండర్‌కు పిండం పెట్టిన నిరుద్యోగులు

చిక్కడపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జాబ్‌క్యాలెండర్ విడుదలై సంవత్సరం గడిచినప్పటికీ ఒక్క ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేయలేదని నిరుద్యోగి దామోదర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు నిరసిస్తూ శనివారం గాంధీనగర్ డివిజన్ గాంధీనగర్ కెనరాబ్యాంక్ పార్క్‌లో జాబ్‌క్యాలెండర్‌కు వర్ధంతి కార్యక్రమాన్ని పిండం పెట్టి నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ గతేడాది ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించారన్నారు.



జాబ్‌క్యాలెండర్‌కు పిండం



జాబ్‌క్యాలెండర్‌కు పిండం పెడుతున్న నిరుద్యోగులు

సంవత్సరం గడుస్తున్నా ఎలాంటి నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగ ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు రవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై కాంగ్రెస్ కపట నాటకం

నల్లకుంట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి డిక్లరేషన్ పేరిట బీసీలపై హామీ ప్రకటన కాంగ్రెస్ కపట నాటకం అని బీజేపీ సీనియర్ నాయకులు, నల్లకుంట మాజీ కార్పొరేటర్ వనం రమేష్ ఆరోపించారు. బీజేపీ ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాకు నల్లకుంట బీజేపీ కార్యాలయం నుంచి ఆ పార్టీ నేతలు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ పేరిట అసెంబ్లీలో తీర్మానం, ఆర్డినెన్స్ పేరిట బీసీలను మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్యామ్‌రాజ్, నర్సింగ్‌రావు, హిమగిరిగౌడ్, వెంకటేష్‌గౌడ్, వీరయ్యగౌడ్, లక్ష్మణ్‌కుమార్, మురళీ ముదిరాజ్, శ్రావణ్, మల్లికార్జున్, జ్యోతి, సునీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ ఓబీసీ మోర్చా ధర్నాలో ప్లకార్డు ప్రదర్శించిన మాజీ కార్పొరేటర్ వనం రమేష్



నిరసనలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి, ఆలే వినయ్‌కుమార్

బీసీలకే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

రాంనగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ముస్లింల 10 శాతం రిజర్వేషన్‌లు లేకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.గోవర్ధన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ ఇచ్చిన పిలుపులో భాగంగా స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం అమలు చేయాలని కోరుతూ బాగ్‌అంబర్‌పేటలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందిరా పార్కు వద్ద జరిగిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చుక్క జగన్; అచ్చిని రమేష్, నాగరాజుచారి, శ్రీనివాస్, సాయన్న, రవీందర్, చిట్టిబాబు, సురేష్‌గౌడ్, సాయినాథ్, కనకలక్ష్మి, సుగుణ; సరళ పాల్గొన్నారు.

● అంబర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోయే 42 శాతం బీసీల రిజర్వేషన్లు కేవలం బీసీలకే వర్తించాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చౌక్‌లో నిర్వహించిన ధర్నాకు అంబర్‌పేట బీజేపీ నేతలు నరేష్‌గౌడ్, నాగభూషణంచారి, వెంకటస్వామిగౌడ్, మైలారం రాజు, రాంచందర్‌గుప్తా, బిక్షపతి, యశ్వంత్; నవీన్‌రెడ్డి, పెంటంరాజు తరలివెళ్లారు.

బీజేపీ ధర్నాకు గంగపుత్రుల మద్దతు



బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శనివారం ఇందిరా పార్కు వద్ద బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ముషీరాబాద్ నియోజకవర్గంకు నాయకులు తరలివెళ్లారు. గంగపుత్ర సంఘం నేతలు బిజ్జి కనకేష్ కుమార్, బిజ్జి రవికుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గంగపుత్రులు ఇందిరాపార్కు వరకు ర్యాలీగా వెళ్లారు ధర్నాకు తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివకుమార్, కృష్ణ, మోహన్‌కృష్ణ, చంద్రశేఖర్, రమేష్ తదితరులు తరలివెళ్లారు. - (ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి)

● దత్తాత్రేయకు చేనేత నేతల వినతి



జాతీయ చేనేత దినోత్సవం వేడుకల నేపథ్యంలో చేనేత కార్మికుల సమస్యలతో కూడిన ఓ వినతిపత్రాన్ని హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు శనివారం ఆయన నివాసంలో ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ, నాయకుడు కైలాష్ నాగేష్ పాల్గొన్నారు. - నల్లకుంట, ఆంధ్రజ్యోతి

జర్నలిస్టులపై నోరు పారేసుకోవడం తగదు : టీడీపీ

రాంనగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై సీఎం రేవంత్‌రెడ్డి నోరు పారేసుకోవడం తగదని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా పేర్కొన్నారు. శనివారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలన విషయంలో సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకోలేక సతమతమవుతూ నైరాశ, నిస్పృశలకు గురై సీఎం రేవంత్‌రెడ్డి జర్నలిస్టులపై నోరు పారేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్యవారధులుగా పనిచేస్తున్న జర్నలిస్టులపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని ఆరోపించారు. జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి వారిని అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, భానుప్రకాష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు



డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు

చిక్కడపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు శనివారం సాయంత్రం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. నగర పోలీసు కమిషనర్ చేపట్టిన 24/7బ్రీత్ టెస్ట్, డ్రంక్ డ్రైవ్ అణిచివేత కార్యక్రమంలో భాగంగా ఈ తనిఖీలు చేశారు. ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ సూచనల మేరకు చిక్కడపల్లి,రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్ ఎం.వీరేశం, ఎస్ఐలు డి.యాదగిరి, కె.సాయిరామ్, పి.సుందర్‌రాజ్ నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రైలులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బ్యాగు చోరీ

బర్కత్‌పుర, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రైలులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బ్యాగును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... సైనిక్‌పురిలో నివాసం ఉంటున్న సన్యాసి నవీన్‌రావు తిరుపతి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తిరుపతి రైల్వే స్టేషన్‌లో వెంకటాద్రి రైల్వే స్టేషన్ ఎక్కుతుండగా తన బ్యాగులో ఉన్న పౌచ్‌ను దొంగలు తస్కరించారు. దానిలో తన కుటుంబ సభ్యులకు చెందిన నాలుగు పాస్‌పోర్టులు, ఐ ఫోన్ ఉన్నాయి. శనివారం కాచిగూడకు వచ్చిన తర్వాత రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం తిరుపతి రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

ఫుట్‌పాత్‌పై చనిపోయిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ రైల్వే స్టేషన్ జనరిక్ మెడికల్ షాపు వెనుక ఆటో స్టాండ్ ఫుట్‌పాత్‌పై 40 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉండగా ప్రయాణికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.